**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ,**
**తేదీ : డిసెంబర్ 16, 2016.**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
విజయవాడ.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చాలి. దోమల బెడదను నివారించాలని కోరుతూ...**

**ఆర్యా!**

ప్రభుత్వం స్మార్ట్ సిటీగా ప్రకటించిన ఒంగోలు నగరంలో ప్రజలు కనీస పౌర సదుపాయాలు అందక కష్టాలు పడుతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు పూర్తిస్థాయిలో నియమించకపోవడంతో దోమలు, డ్రైనేజి సమస్యలతో నగరం దురంధం పూరితంగా మారింది. జిల్లాలోని పెద్ద ఆసుపత్రి రిమ్స్‌లో 400 పోస్టులు ఖాళీగా వుండడంతో ప్రజలకు వైద్య సదుపాయాలు పూర్తి స్థాయిలో అందడంలేదు. నగరానికి పొంచి వున్న పోతురాజు కాలువ ముంపు వల్ల 12 కార్పొరేషన్ డివిజన్లలో దురంధం – దోమల బెడద తీవ్రమైంది. ట్రాఫిక్ సమస్య అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. మంచినీటి కొరత తీవ్రంగా వుంది. ఇప్పటికైనా ఒంగోలు నగర ప్రజలు ఎదుర్కొంటున్న ఈ క్రింది సమస్యలను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

**(1) పారిశుద్ధ్యం :–** ఒంగోలు మున్సిపాలిటీ కార్పోరేషన్‌గా అప్‌గ్రేడయినా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను మాత్రం పెంచలేదు. ప్రస్తుత అవసరాలకు ఉన్న కార్మికులకుతోడు మరో 400 మంది కార్మికులను నియమించితేకాని పారిశుద్ధ్యం, డ్రైనేజి సమస్యలు కొంతలో కొంత పరిష్కారం అవుతాయి. మురుగు శాశ్వత పరిష్కారానికి అండర్‌గ్రౌండ్ డ్రైనేజి ఏర్పాటు చేయాలి.

**(2) మంచినీటి సమస్య :–** గతంలో మూడు రోజుల కొకసారి ఇచ్చేవారు. ఇప్పుడు నాలుగురోజుకొకసారి ఇస్తున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ నుండి 1 టియంసి నీటిని వినియోగించుకునే ఉత్తర్వులు ఉన్నాయి. అయితే ఆ నీటిని ఉపయోగించుకోవడానికి రిజర్వాయర్ నుండి ఒంగోలు సమ్మర్‌స్టోరేజి ట్యాంకులకు నీరు తీసుకువచ్చే పైప్‌లైన్ ఏర్పాటు చేయకపోవడంతో మంచినీటి సరఫరా సరిగ్గా జరగడంలేదు. ప్రస్తుతం వున్న ఓవర్‌హెడ్ ట్యాంకులు కూడా అవసరాలకు సరిపడా లేవు. 25 శాతం ఏరియాకుపైప్‌లైన్స్ లేవు. పైప్‌లైన్ నిర్మాణంకోసం తక్షణం నిధులు కేటాయించి వేగంగా పనులు పూర్తిచేయాలి. అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మాణం చేపట్టాలి.

**(3) అందరికి ఇళ్ళపథకం అమలు :–** ఇళ్ళు లేనివారందరికీ ఇస్తామని ప్రకటించారు. అయితే ఇప్పటి వరకు స్థలం సేకరణగానీ, లబ్ధిదారుల ఎంపికగానీ జరగలేదు. 10 వేల మందికి పైగా పేదలు సొంత ఇళ్ళు లేక దరఖాస్తులు చేసుకొన్న అర్హులైనవారందరికీ వెంటనే ఇళ్ళు మంజూరుచేసి స్థలం కేటాయించాలి. పోరంబోకు స్థలాల్లో ఇళ్ళు వేసుకొన్నవారికి పట్టాలివ్వాలి.

..... రెండవ పేజీ

**(4) రిమ్స్ :–** జిల్లాలో ఇదే పెద్దాసుపత్రి. ఇక్కడకు రోజుకు 1000 మందికి పైగా వైద్యంకోసం వస్తున్నారు. 2005లో ప్రారంభించినప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో నిర్మాణాలుకాలేదు. ఈ ఆసుపత్రిలో డెంగ్యూవ్యాధి నివారణకు ప్లేట్‌లెట్ మిషన్ లేదు. యంఆర్ఐ స్కాన్, వెంటిలేటర్ సౌకర్యాలు లేకపోవడంతో రోగులకు వైద్యం అందడంలేదు. వివిధ విభాగాల్లో సుమారు 400 పోస్టులు ఖాళీగా వుండడంతో ఉన్న వైద్య సౌకర్యాలు కూడా అందుబాటులోకి రావడంలేదు. తక్షణం సిబ్బంధిని నియమించాలి.

**(5) యూనివర్శిటీ :–** 110 ఎకరాల స్థల సేకరణ జరిగింది. యూనివర్శిటీని మంజూరు చేసినా నేటికీ ప్రారంభించలేదు. వచ్చే విద్యాసంవత్సరంనుండైనా క్లాసులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. భవన నిర్మాణాలు పూర్తయ్యేలోగా అద్దె భవనాల్లోనయినా యూనివర్శిటిని ప్రారంభించాలి.

**(6) ట్రిపుల్ఐటి :–** అబ్దుల్ కలాం పేరుతో ఒంగోలులో ఏర్పాటుకు ప్రభుత్వం జి.వో విడుదల చేసింది. కానీ ఇంతవరకు స్థల సేకరణ జరగలేదు. తాత్కాలికంగా ఇడుపులపాయలో క్లాసులు నిర్వహిస్తున్నారు మినహా ఇక్కడ ట్రిపుల్ ఐటి నిర్మాణంపై శ్రద్ధ చూపడంలేదు. తక్షణమే ప్రభుత్వం కాలేజికి అవసరమైన స్థలం కేటాయించాలి. భవనాలు పూర్తయ్యేలోగా వచ్చే విద్యా సంవత్సరం నుండి ఒంగోలు పివిఆర్ బాలుర పాఠశాల (లేక) శర్మ కాలేజిలో క్లాసులు నిర్వహించాలి.

**(7) స్మార్ట్‌సిటి :–** 2014లో స్మార్ట్ సిటిగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. కాని ప్రభుత్వం నుండి నిధులు కేటాయింపులు సరిగాలేనందున అభివృద్ధి పనులు జరగడంలేదు. ఏటా రాష్ట్ర ప్రభుత్వం వంద కోట్లు కేటాయించడంతో పాటు, అమృత్ పథకం క్రింద కేంద్రం నుండి నిధులు రాబట్టాలి.

**(8) పోతురాజు కాలువ ఆధునీకరణ :–** ఒంగోలు నగరంలో కాలుష్యానికి, ముంపుకు కారణమైన పోతురాజు కాలువ ఆధునీకరణకు 80 కోట్లు నిధులు కేటాయిస్తామని మీ పర్యటన సందర్భంగా నగర ప్రజలకు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు ఆధునీకరణ పనులు ప్రారంభం కాలేదు. వరదలు వచ్చినప్పుడు నగరంలో 12 వార్డుల్లో ఇళ్ళల్లోకి నీరు వస్తున్నాయి. తక్షణమే ఆధునీకరణకు నిధులు కేటాయించి పూర్తిచేయాలి.

**(9) ఇఎస్ఐ ఆస్పత్రి :–** ఒంగోలు, ఒంగోలుపరిసర చీమకుర్తి, గుళ్ళాపల్లి పారిశ్రామిక వాడలలో రెండు లక్షలమంది కార్మికులు వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్నారు. వీరికి అందుబాటులో ఇఎస్ఐ ఆసుపత్రి లేదు. కావునా ఒంగోలులో ఇఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలి.

**(10) రోడ్లు వెడల్పు :–** ఒంగోలు –కొత్తపట్నం, ఒంగోలు– సంతనూతలపాడు రోడ్లను విస్తరించాలి. బైపాస్ రోడ్డుకు అండర్ పాస్‌లు లేక ప్రజలు ప్రమాదానికి గురవుతున్నారు. అందువల్ల అంజయ్య రోడ్డు, మంగమూరు రోడ్డు, ముక్తినూతలపాడు రోడ్డుల వద్ద అండర్‌పాస్‌లను నిర్మించాలి.

***అభివందనములతో...***

**(పెనుమల్లి మధు)**

రాష్ట్ర కార్యదర్శి